క్లుప్తంగా

ఘనంగా పుస్తక దినోత్సవం

గుడివాడ టౌన్: అంతర్జాతీయ పుస్తక దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది యునెస్కో ప్రకటించిన రీడ్ యువర్ వే అనే అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ ప్రసంగించారు. విద్యార్థి స్వయంగా చదివి నేర్చుకునే విధంగా ప్రోత్సహిస్తూ ఉపాధ్యాయుడు విద్యార్థి తప్పులను సరి చేయాలన్నారు. అనంతరం రీడ్ యువర్ వే అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీల్లో షేక్ రుక్సానా ప్రథమ, ఎం.శ్రీలక్ష్మి ద్వితీయ, జె.వేణు మణికంఠ తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ రాబిన్‌సన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

ముదినేపల్లి రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించి జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని పెయ్యేరులో ఆమె ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ అల్లు సుశీల, ఎంపీటీసీ సభ్యుడు కోటే ప్రవీణ్, నాయకులు ఏసుబాబు, రాజేంద్రప్రసాద్, పేర్ని పృథ్వీ, విష్ణువర్ధన్, వెంకటేశ్వరరావు, దివి సతీష్, షేక్ అల్లాభక్షు పాల్గొన్నారు.

గోనెపాడులో..

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు శ్రీఅనుపమ కోరారు. ఆమె మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని గోనెపాడులో నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు రామారావు, నాయకులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ రాజు, రాము, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూడు గడ్డివాముల దగ్ధం

ముదినేపల్లి రూరల్: గురజలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామంలో చనిపోయిన ఓ వ్యక్తికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు బాణసంచాను కాలుస్తూ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లే క్రమంలో తారాజువ్వ నిప్పులు గడ్డివాముపై పడి మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో రెండు గడ్డివాములకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో 20 ఎకరాల గడ్డివాములు దగ్ధమై రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు బాధితుడు పి.కిరణ్మయి తెలిపారు. సమాచారం అందుకున్న కైకలూరు, బంటుమిల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.

సంక్షేమ సారథినే గెలిపించండి



అప్పికట్ల (పెదపారుపూడి): ప్రతి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని వైఎస్సార్ సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. మండలంలోని అప్పికట్లలో మంగళవారం ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ గోగం సురేష్, మార్కెట్ యార్డు చైర్మన్ తుమ్మల ఉషారాణికోటేశ్వరరావు, సర్పంచ్ వెల్లంకి సరళాదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మూల్పూరి హరీష, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోళ్ల సోమేశ్వరరావు, నాయకులు పట్టాభి, చిరుగుపాటి శ్రీధర్, చంద్రశేఖర్, దాసు, కోటయ్య, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ప్రసాద్ మృతి

ముదినేపల్లి రూరల్: సంఘర్షణపురం మాజీ సర్పంచ్ సంకుల ప్రసాద్ (60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తదితరులు ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు వీరమల్లు కొండలరావు, సొసైటీ చైర్మన్ ముత్యాల రాంబాబు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

గుడివాడరూరల్: పేదలకు, ప్రభుత్వానికి వారధిగా సేవలు చేస్తున్న తమపై ప్రతిపక్ష టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలు తట్టుకోలేక తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నామని బొమ్ములూరు గ్రామ వలంటీర్లు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామానికి చెందిన 18మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు సంబంధించి రాజీనామాల లేఖలను ఎంపీడీఓ కె.జ్యోతికి అందజేశారు. వారు మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తున్న తమను విమర్శించిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలతో పాటు తాము కూడా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాజీనామా చేసిన వారిలో దుర్గప్రసన్న, కుమారి, దేణుకాదేవి, జ్యోష్న, సాయి తేజస్వీ, రమాదేవి, వాణి, వరలక్ష్మి, వనిత, నీలిమ, రాజకుమారి, నవీన్, జ్ఞానేంద్ర, ప్రేమ్‌కుమార్, రవీంద్ర, వంశీ, దయాకర్, రెబ్కాలు ఉన్నారు.

పేదలకు మంచి జరిగింది సీఎం జగన్ పాలనలోనే

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



అభిమానుల ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: ఎక్కడా వివక్ష, లంచాలు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలకు సంక్షేమ ఫలాలను అందించి మంచిని చేకూర్చారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఆయన చంద్రాల, సింగలూరు, విన్నకోటలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు రాకముందే వలంటీర్లను చంద్రబాబు ఇబ్బంది పెట్టారన్నారు. బాబు దొంగ మాటలను ఎవరూ నమ్మకూడదన్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు ఒక్కటైనా మంచి పని చేశారా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయనకు ప్రజానీకం పూలమాలలతో స్వాగతం పలికారు. అభివాదాలు చేస్తున్న ఆయన్ను మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతించారు. ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, నాయకులు పాలడుగు రాంప్రసాద్, గిరి బాబాయ్, కేజే విక్టర్ పాల్, సూరపనేని కల్యాణ్, నిమ్మగడ్డ కుటుంబరావు, కొత్తూరి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాయన రవి, పార్టీ యువజనాధ్యక్షుడు గుదే రవి, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత, ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ పోలగాని రమాదేవి, మండల బూత్ కన్వీనర్ కోటప్రోలు నాగు, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, ఎంపీటీసీ సభ్యులు కొడాలి కన్నమ్మ, పెనుమాల పూర్ణ కవిత, ఈడె లక్ష్మి, మండా దిలీప్, సర్పంచ్‌లు కాలిశెట్టి అర్జునరావు, ముత్యాల సాంబయ్య, గోసాల జ్యోతి, కటికల జ్యోతిలత, మేడేపల్లి రవికుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొడాలి నానికి పూలమాల వేసి ఆహ్వానిస్తున్న నాయకులు →

వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధం

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్



పామర్రు: వైఎస్సార్ సీపీకి పామర్రు కంచుకోట అని, రానున్న ఎన్నికల్లో కూడా పార్టీని గెలిపించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ మెజార్టీతో విజయం అందించారన్నారు. ఈ ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యారంగంలో అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, వసతి దీవెన తదితరాలను అందించి సమాజంలో మార్పుకోసం ఎంతో కృషి చేశామన్నారు. ప్రతి గ్రామంలో రూ.2 కోట్లతో మండల పరిషత్, జెడ్పీ పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామున వృద్ధాప్య, వితంతు తదితర పింఛన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 12–13 వేల మందికి ఇళ్ల స్థలాలను అందించామన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ కలిసి కూటమిగా ఏర్పడి మూకుమ్మడిగా జగన్‌పై పోటీకి దిగుతున్నారన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా రానున్న ఎన్నికల్లో విజయం సాధించేది వైఎస్సార్ సీపీనే అని తెలిపారు. నియోజకవర్గంలో రూ.18 కోట్లతో ప్రతి ఇంటికీ వాటర్ పైపులైన్ల పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే రూ.15 కోట్లతో పనులు చేశామన్నారు.

రూ.కోటితో బస్టాండ్ అభివృద్ధి

పామర్రు బస్టాండ్ అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడి రూ. కోటి మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం పనులను జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ సేవలను అందిస్తానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావును, పామర్రు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

25న నామినేషన్ దాఖలు

ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు పామర్రులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోనివైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు సత్కారం

గుడివాడ టౌన్: పదో తరగతి పరీక్షల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 590 మార్కులు సాధించిన అల్లంపల్లి భాను ప్రసన్న విజయం స్థానిక పురపాలక సంఘ పాఠశాలలకు గర్వకారణం అని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి. ఇమ్మానుయేల్, డి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ఏకేటీపీ బాలికల పాఠశాలలో భానుప్రసన్నను ఎస్టీయూ పట్టణశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ శాఖ కార్యదర్శి డానియేల్, అధ్యక్షుడు ఇబ్రహీం, సభ్యులు టీవీఎన్‌డీ ప్రసాద్, అరవింద్, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి హైస్కూల్లో పది పరీక్షల్లో 578 మార్కులు సాధించి మండలంలో ప్రథమంగా నిలిచిన మరడాని సాయిశ్రీని మండవల్లి గ్రంథాలయం వద్ద మంగళవారం సత్కరించారు. స్థానిక బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు, సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ విజయ్‌కుమార్, గ్రంథాలయాధికారి పర్వీన సాయిశ్రీని సత్కరించి అభినందనలు తెలిపారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 586 మార్కులు సాధించిన పి.మను బాలాజీని మంగళవారం ఎంఈఓ జగన్‌మోహన్ సత్కరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అమలవుతుందని చెప్పేందుకు మను బాలాజీ సాధించిన మార్కులే నిదర్శనమని ఎంఈఓ పేర్కొన్నారు.

హేమశ్రీనికి అభినందనలు

మండవల్లి: పది పరీక్షల్లో 575 మార్కులు సాధించిన కానుకొల్లు విద్యార్థిని జి.హేమశ్రీని కానుకొల్లు మండల సమాఖ్యలో ఏపీఎం జి.రాజశ్రీ, సిబ్బంది మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా హేమశ్రీ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో మంచి మార్కులు సాధించినట్టు తెలిపారు. సివిల్స్‌లో ర్యాంకు సాధిండం తన లక్ష్యమని పేర్కొన్నారు.

కానుకొల్లు జెడ్పీ హైస్కూల్‌కు ప్రథమ స్థానం

మండవల్లి: మండవల్లి మండలం కానుకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 88.09 శాతం ఉత్తీర్ణతతో కైకలూరు నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు హెచ్ఎం ఎన్‌వై మాధవకుమార్ మంగళవారం తెలిపారు. పాఠశాలలో పది పరీక్షలకు 42 మంది విద్యార్థులు హాజరు కాగా 37 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థిని గొర్ల హేమశ్రీ 575 మార్కులు సాధించినట్లు తెలిపారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు



పమిడిముక్కల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోదరి అనిత అన్నారు. పేదల పిల్లలు ఉన్నత చదువులు, పేదలు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగలుగుతున్నారన్నారు. మండలంలోని మేడూరులో మంగళవారం ఎంపీపీ కాసాని వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి, సర్పంచ్ గొర్కెపూడి స్వర్ణలతతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు బుజ్జి, పోలిమెట్ల వంశీకృష్ణ, ఆనంద్, శ్రీనివాసరావు, మహేష్ పాల్గొన్నారు.

సీఎం జగన్ వెంటే జనం



కలిదిండి: పార్టీలెన్ని జతకట్టినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని, ప్రజలందరి దీవెనలతో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కొండూరులో ప్రజా ఆశీర్వాద యాత్రను నాయకులతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లుగా కులం, మతం, వర్గం, రాజకీయ అజెండానే లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. రానున్న ఎన్నికల్లో శాసన సభ అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమేష్, వైస్ ఎంపీపీ కనక దుర్గారాణి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సంధ్య, తాడినాడ పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నబ్బాయిరాజు పాల్గొన్నారు.

జైత్రయాత్రకు సిద్ధం

రేపు నామినేషన్ దాఖలు చేయనున్న కొడాలి నాని



గుడివాడరూరల్: ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సార్వత్రిక సమరానికి 'సిద్ధం' అయ్యారు. గుడివాడ ఎమ్మెల్యేగా ఐదోసారి గెలిచి చరిత్ర సృష్టించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రజల మనిషి, కష్టం అని ఎవరూ వెళ్లినా తానున్నా అంటూ భరోసా ఇచ్చే వ్యక్తిగా ఎమ్మెల్యే కొడాలి నాని నియోజకవర్గంలో పేరు గడించారు. ఈ నెల 25వ తేదీ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వర్గీయ నందమూరి తారక రామారావు పిలుపు మేరకు రాజకీయాల్లో వచ్చిన కొడాలి నాని 2004 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్‌పై విజయం సాధించారు. 2009లో కృష్ణా జిల్లా రాజకీయాలను శాసించే స్వర్గీయ పిన్నమనేని కోటేశ్వరరావు తనయుడు మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావుపై పోటీ చేసి రెండోసారి గెలుపొందారు. రెండుసార్లు టీడీపీ అభ్యర్థిగా గెలిచిన కొడాలి నాని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడును అక్రమంగా అరెస్ట్ చేయడంతో మనస్తాపం చెంది వైఎస్సార్ సీపీలో చేరారు. 2014 జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రావి శోభనాద్రిచౌదరి తనయుడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టి తనకు తిరుగులేదని నిరూపించారు. 2019 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కొడాలి నాని బరిలోకి దిగగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాగైనా కొడాలి నానిని ఓడించాలని ఆర్థికంగా బలవంతుడైన దేవినేని అవినాష్‌ను రంగంలోకి దించారు. అవినాష్‌కు అన్యాయం చేస్తున్నామని టీడీపీ నేతలు చెబుతున్నా చంద్రబాబు వినకుండా గుడివాడ అభ్యర్థిగా రంగంలోకి దించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే కొడాలి నాని భారీ విజయం సాధించి గుడివాడ గడ్డ కొడాలి నాని అడ్డా అని నిరూపించారు. కాగా దేవినేని అవినాష్ చంద్రబాబు చేసిన మోసాన్ని తెలుసుకుని వైఎస్సార్ సీపీలో చేరారు.

మరోసారి చంద్రబాబు వ్యూహాలు

గుడివాడలో కొడాలి నానిని ఎదుర్కొనే నాయకుడు టీడీపీలో లేకపోవడంతో 2019లో మాదిరిగానే మరోసారి చంద్రబాబునాయుడు ఎన్ఆర్ఐ, ఆర్థికంగా బలవంతుడైన వెనిగండ్ల రాముకు సీటు ఇచ్చి ఎలాగైనా కొడాలి నానిని ఓడించాలని ఉన్నారు. ఇప్పటికే రూ.కోట్లు విచ్చలవిడిగా వెదజల్లి ప్రజలను ఆకట్టుకునే పనిలో వెనిగండ్ల రాము ఉండగా.. ప్రజలు మాత్రం రామును పట్టించుకోవడం లేదు. ప్రచారం కూడా అంతంత మాత్రమే. టీడీపీకి చెందిన ఐదారుగురు నాయకులు, రోజువారీ కూలి చెల్లించి తీసుకెళ్తున్న జనాలు మినహా ప్రజలు మాత్రం స్వచ్ఛందంగా పాల్గొని మద్దతు తెలపడం లేదు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కొడాలి నాని మంత్రి అయ్యారు. ఈ క్రమంలో గుడివాడ నియోజకవర్గానికి దశాబ్దాలుగా ఉన్న బస్టాండ్, రైల్వే ఫ్లై ఓవర్లు, తాగునీటి సమస్య, గ్రామాల్లో రహదారుల తదితర సమస్యలను పరిష్కరించేందుకు కోట్ల రూపాయలు తీసుకొచ్చి అభివృద్ధి చేశారు.

అదే విధంగా పేదలకు సొంతింటి కలను నేరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తే ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మల్లాయపాలెం పరిధిలో రాష్ట్రంలో అతిపెద్ద టిడ్కో సముదాయం ఏర్పాటు చేశారు. ఈ ఇళ్లల్లో నివాసముండే ప్రజలకు అన్ని వసతులు కల్పించి స్వయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్లను ఎమ్మెల్యే కొడాలి నాని పంపిణీ చేయించారు. మరోసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని గెలుపును ఎవరూ ఆపలేరని నియోజకవర్గంలోని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు.

బ్యాంక్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేయాలి

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆశీస్సులతో ది గుడివాడ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ పదవి పొందిన దారం నరసింహారావు వెంటనే రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం గుడివాడ శాఖ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ సంఘం సర్వసభ్య సమావేశం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రావులకొల్లు మల్లేశ్వరరావు నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభిమానులు, కొడాలి నాని ప్రోత్సాహంతో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నరసింహరావును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొడాలి నానికి ద్రోహం చేసి టీడీపీలో చేరడం దుర్మార్గం అన్నారు. బీసీ భవన్ నిర్మాణానికి కావలసిన రెండు వేల గజాలు మున్సిపల్ రిజర్వుడు స్థలాన్ని సర్వే చేయించి పురపాలక సంఘం ఆమోదం అనంతరం జిల్లా కలెక్టర్ అనుమతి కోసం ఫైల్ వెళ్లిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో దానిపై కలెక్టర్ కార్యాలయంలో నిర్ణయం తీసుకోలేదన్నారు. తన వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ ఫిరాయించిన నరసింహారావు బీసీ భవనం నిర్మాణానికి సహకరించలేదని సాకు చెప్పడం నీచమైన చర్య అన్నారు. తక్షణమే నరసింహారావు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకట కృష్ణారావు, పి.కృష్ణారావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కె. యశోద యామినీదేవి, కార్యదర్శి శ్రీదేవి, రెడ్డి అప్పారావు, శేషుబాబు, రమణకుమార్, బి.వెంకటేశ్వరరావు, బి.సూర్యనారాయణ, శ్రీనివాసరావు, ఓంకార్ పాల్గొన్నారు.

మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీదే



దోసపాడు(పెదపారుపూడి): కూటమి పార్టీలు ఎన్ని జత కట్టినా మళ్లీ అధికారంలోకి వైఎస్సార్ సీపీ కచ్చితంగా వస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూల్పూరి హరీష అన్నారు. మండలంలోని దోసపాడులో ఆమె మంగళవారం మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించటంతో పేదలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చారని పేర్కొన్నారు. జరిగిన సంక్షేమం, అభివృద్ధి చూసే ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పార్టీలకతీతంగా చేసిన పనులే ఆయన్ను మరోసారి గెలిపిస్తాయని తెలిపారు.

టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు విచ్చల విడిగా ఖర్చు



ఆర్వో పద్మావతికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాము



బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న టీడీపీ నాయకులు

- నామినేషన్‌కు ప్రజలను రప్పించేందుకు వెదజల్లిన డబ్బు
- మద్యం షాపుల వద్ద పసుపు నేతల సందడి
- బహిరంగంగానే మద్యం తాగిన టీడీపీ నాయకులు

గుడివాడరూరల్: గుడివాడ టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము మంగళవారం తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.పద్మావతికి అందజేశారు. నామినేషన్ సందర్భంగా పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల నుంచి ప్రజలను భారీగా తీసుకొచ్చేందుకు ఒక్కొక్కరికి రూ.300 చొప్పున ఇచ్చి విచ్చలవిడిగా నగదు ఖర్చు పెట్టారు. అయినా సరే ప్రజలు ఆయన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పసుపు నేతలకు డబ్బులు ముందుగానే పంపిణీ చేసి, ప్రజలను సమీకరించడంలో విఫలం కావడంతో ఆయా గ్రామాల నాయకులపై రాము ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదేవిధంగా పసుపు నేతలు బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతూ రహదారుల వెంబడి వెళ్లే ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. ఎన్ఆర్ఐ అయిన రాము ఈ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు, మద్యం సరఫరా చేసి గెలవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు చర్చించుకున్నారు.


మందు బాబుల హడావుడి..

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న వెనిగండ్ల రాము నామినేషన్ కార్యక్రమంలో మందుబాబుల హడావుడి ఎక్కువైంది. మంగళవారం ఏ బార్‌లో చూసినా.. మద్యం దుకాణంలో వద్ద పసుపు చొక్కాలు, పసుపు కండువాలే దర్శనమిచ్చాయి. రూ.300 మనిషికి ముందుగా ఇస్తేనే ఆటో లేదా ట్రాక్టర్ ఎక్కేది లేదని కిరాయి మనుషులు డిమాండ్ చేయడంతో ముందుగానే కొంతమందికి డబ్బిచ్చి బండెక్కించారు. పట్టణానికి చేరుకున్న కార్యకర్తలు పసుపు కండువాలు, పసుపు చొక్కాలు వేసుకుని బారుల్లో దర్శనమిచ్చారు.



మద్యం దుకాణం ముందు క్యూ కట్టిన తెలుగు తమ్ముళ్లు


పామర్రులో రెండు నామినేషన్ల దాఖలు



పామర్రులో నామినేషన్ పత్రాన్ని ఆర్వో శ్రీదేవికి అందజేస్తున్న కైలే జగదీష్

పామర్రు: పామర్రు అసెంబ్లీకి సంబంధించి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి బూసి శ్రీదేవి తెలిపారు. వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్ తరఫున తన సోదరుడు కైలే జగదీష్ బిఫారంతో కూడిన నామినేషన్ పత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొంతి వెంకటేశ్వరరావు, కొడాలిసురేష్ పాల్గొన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున శ్రీరాజా మనోహర్, పామర్రు అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారని ఆర్వో తెలిపారు.

కారుమూరి సునీల్ నామినేషన్‌కు తరలిన నేతలు



సునీల్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి వెళుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ

కైకలూరు: వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ నామినేషన్ కార్యక్రమానికి కైకలూరు నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు మంగళవారం ఏలూరు తరలివెళ్లారు. ఏలూరులో అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, నాయకులు బీవీ.రావు, పోసిన చెంచురామారావు, ముంగర నరసింహారావు, సయ్యపురాజు గుర్రాజు, నీలపాల వెంకటేశ్వరరావు, సురేష్, వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు ర్యాలీకి వెళ్లిన వారిలో ఉన్నారు.

ఎలక్షన్ ఆఫీసర్ అంటూ వసూలు

మొవ్వ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో తాను 'ఎలక్షన్ అధికారినని, మీ దగ్గర తగిన ఆధారాలు లేకుండా డబ్బులు ఉండకూడదు' అంటూ బెదిరించి ప్రయాణికుల నుంచి నగదు వసూలు చేసిన ఓ వ్యక్తిని ప్రయాణికులు పట్టుకుని కూచిపూడి పోలీసులకు అప్పజెప్పిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు పెనమలూరుకు చెందిన చాట్ల రాజు ఎలక్షన్ అధికారిని అని పెనుమత్సకు చెందిన రాంబాబు వద్ద నుంచి రూ.9,910, మొవ్వకు చెందిన సుబ్బారావు వద్ద నుంచి రూ.820, మొవ్వకు చెందిన వీర దుర్గారావు నుంచి రూ.470 వసూలు చేశాడు. దీనిపై సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరు, పవన్ రీల్ హీరోలైతే.. రియల్ హీరో వైఎస్ జగన్

గుడ్లవల్లేరు: ఈ ఎన్నికల్లో చిరంజీవి, పవన్ కల్యాణ్ వంటి రీల్ స్టార్లు వంద మంది వచ్చినా.. తన సుపరిపాలనలో సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజలే తనకు స్టార్ క్యాంపెయనర్లు అనుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం దృష్టిలో రియల్ హీరో అని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం జాన్‌బెన్నీ అన్నారు. గుడ్లవల్లేరు మండలం కూరాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల కోసం కాకుండా స్వార్థ చింతన కోసమే పవన్ కల్యాణ్ బాటలోనే చిరంజీవి రాజకీయ ధోరణి ఉందని ఆరోపించారు. తన సినిమా రిలీజ్‌కు టికెట్ల ధరల అంశం కోసం ఏపీని జగన్ అభివృద్ధి చేస్తున్నారని ఆనాడు చిరంజీవి కొనియాడారని గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు కూటమితో జత కట్టిన ప్యాకేజీ స్టార్ కోసం తాను రాజకీయంగా తన తమ్ముడి బాటలోనే అని ప్రస్తుతం చిరంజీవి చెబుతున్నారన్నారు. అప్పుడు తన స్వార్థం కోసం జగన్‌ను పొగిడి, ప్రస్తుతం తమ్ముడి కోసం కూటమికి చందాలు కూడా ఇవ్వటం దారుణంగా ఉందన్నారు. తెలంగాణాలో ఉండే ఈ నాయకులు ఏపీలో జరిగే సంక్షేమాభివృద్ధి చూడకుండా పొత్తులు ప్రకటించుకోవటం పరిపాటి అయిపోయిందని ఆక్షేపించారు. తమ అవసరాలను బట్టి కాకుండా ప్రజల అభివృద్ధి కోసం ఏనాడైనా రాజకీయంగా కృషి చేశారా అని జాన్‌బెన్నీ ప్రశ్నించారు.